సాక్షి కర్నూలు

శనివారం ; 12 ; ఆగస్టు ; 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒంగోలుకు చెందిన హనుమంతరావు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



వేడుకగా 'నా భూమి- నాదేశం'

'నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాలను గ్రామాల్లో వేడుకగా చేపడుతున్నారు. శుక్రవారం 350 పంచాయతీల్లో ఉత్సవాలు నిర్వహించారు. 10లో



'పట్టు'తప్పకుండా..

పట్టు సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. యూనిట్ ధరలో ఎస్సీ, ఎస్టీలకు 90, ఇతరులకు 75 శాతం సబ్సిడీ ఇస్తోంది. రూ.1.27 కోట్ల 'ఉపాధి' నిధులను మంజూరు చేసింది. 10లో

న్యూస్‌రీల్

రానుపోను టిక్కెట్లపై 10శాతం రాయితీ

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో రానుపోను టిక్కెట్లు ఒకేసారి రిజర్వేషన్ చేసుకుంటే 10శాతం రాయితీ కల్పిస్తున్నామని ఆర్టీసీ కర్నూలు-2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెండు టిక్కెట్లు ఒకేసారి తీసుకుంటే కేవలం తిరుగు ప్రయాణానికి మాత్రమే రాయితీ ఉండేదన్నారు. అయితే ఇటీవలే రానుపోను టిక్కెట్లకు రాయితీ వర్తిస్తూ సంస్థ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సదుపాయం ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో అందుబాటులో ఉందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు ఈ నెల 18న కర్నూలుకు రానున్నారు. కర్నూలు టౌన్, డోన్ డివిజన్ల అధికారులతో సమీక్ష నిర్వహించేందుకు ఆయన ఇక్కడికి వస్తున్నారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్, కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎం అండ్ పీ, కన్‌స్ట్రక్షన్స్ విభాగాలు, అకౌంట్స్ ఆఫీసర్లతో సమావేశం కానున్నారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర



అమ్మకానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గత రెండు నెలల నుంచి పత్తి ధర నిలకడగా ఉంది. ఈ వారం నుంచి పత్తి ధర రోజురోజుకు స్వల్పంగా పెరిగి శుక్రవారం రూ.7,708లకు చేరింది. యార్డుకు రైతులు 676 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.7708, మధ్య ధర రూ.7320, కనిష్ట ధర రూ.5,097 నమోదయ్యింది. అంతేకాకుండా వేరుశనగ ధరకూడా ఈ వారం నుంచి స్వల్పంగా పెరిగింది. 795 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా గరిష్ట ధర రూ.8179, మధ్య ధర రూ.7196, కనిష్ట ధర రూ.3086.. ఆముదాలు 59 క్వింటాళ్లు రాగా గరిష్ట ధర రూ.6195లు లభించింది.

ఏడు మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 7 మండలాల్లో వర్షపాతం నమోదు కాగా.. కొతాళంలో 38.2 మి.మీ భారీ వర్షం కురిసింది. తుగ్గలిలో 20.8, వెల్దుర్తిలో 4.8, పత్తికొండలో 3.4, ఓర్వకల్లులో 3.0, కల్లూరులో 1.2, ఆదోనిలో 1.2 మి.మీ ప్రకారం వర్షాలు పడ్డాయి. జిల్లా మొత్తం సగటున 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 16 మి.మీ వర్షపాతం నమోదైంది.

'స్థాయి'ని మరచి నిర్లక్ష్యమా?



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ మధుసూదన్



స్థాయీ సంఘ సమావేశాలకు హాజరైన అధికారులు

- ప్రజాప్రతినిధులంటే లెక్క లేదా?
- ప్రజా సమస్యల పరిష్కార వేదికపై అలసత్వమా?
- అధికారుల తీరుపై జెడ్పీ చైర్మన్ ఆగ్రహం
- రూ.830 కోట్ల జేజేఎం పనులను పూర్తి చేయాలని ఆదేశం
- హాజరైన ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): '' జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలంటే లెక్క లేదా .. వందల కిలోమీటర్ల నుంచి జెడ్పీటీసీ సభ్యులు పనిలేక వస్తున్నారనుకుంటున్నారా ... వారంతా దాదాపు 40 వేల నుంచి 50 వేల మంది ప్రజలకు ప్రతినిధులనే విషయాలను గుర్తుంచుకోండి ... క్షేత్ర స్థాయిలోని సమస్యలకు పరిష్కార వేదిక అయిన ఈ సమావేశాలపై ఇంత నిర్లక్ష్యమా'' అంటూ అధికారుల పనితీరుపై జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. 'ఈ సమావేశాలకంటే విలువైన పనులుంటే కనీసం అవగాహన ఉన్న సబార్డినేట్స్‌ను పంపించండం కూడా చేతకాదా..'అంటూ మండిపడ్డారు. శుక్రవారం ఉదయం స్థానిక జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాలకు ఎమ్మెల్సీ డాక్టర్ బీ మధుసూదన్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ ముజాఫర్ నాయక్, సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డితో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు హాజరయ్యారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన అంశంపై జరుగుతున్న చర్చలో హౌసింగ్ పీడీకి బదులుగా హాజరైన హౌసింగ్ అధికారి ఇచ్చిన సమాధానంపై జెడ్పీ చైర్మన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరు అయిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వచ్చే సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని సీఈఓను జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ఆదేశించారు.

వచ్చే సమావేశాల నాటికి మినీ గోకులాల నిధులు క్లియర్ చేయండి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న మినీ గోకులాలకు సంబంధించిన బిల్లులను వచ్చే సమావేశాల నాటికి క్లియర్ చేయాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశించారు. అధికారులు కోరిన విధంగా ఎంబుక్ తదితర రికార్డులను సబ్మిట్ చేసినా, బిల్లులను విడుదల చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు ఎస్ సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి జోక్యం చేసుకుంటు బిల్లులను విడుదల చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డికి సూచించారు.

ప్రభుత్వ హాస్పిటల్‌లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయండి

రాయలసీమలోని ఎనిమిది జిల్లాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వచ్చే గ్రామీణ ప్రాంతాల వారికి ఉపయోగపడే విధంగా స్థానిక ప్రభుత్వ జనరల్ అసుపత్రిలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని జెడ్పీ చైర్మన్ కోరారు. ఏ వార్డు ఎక్కడుందో, ఎలా వెళ్లాలో తెలియక అనేక మంది పడుతున్న ఇబ్బందులను గమనించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు 108 అంబులెన్స్‌లు రావడం లేదని కర్నూలు జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్ ఆరోపించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు పోకపోతే ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని జెడ్పీ చైర్మన్ ప్రశ్నించారు. 108 సర్వీసుల నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న సేవలను గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికులకు అందే ప్రయోజనాలపై కూడా అవగాహన పెంచాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కే వెంకటేశ్వర్లును కోరారు.

'జలజీవన్' పనులను సకాలంలో పూర్తి చేయండి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.830 కోట్లతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ నాగేశ్వరరావును జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ఆదేశించారు. కర్నూలు జిల్లాకు రూ.533 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.297 కోట్లు మంజూరయ్యాయన్నారు. తాగునీటికి ఇంత పెద్ద మొత్తంలో ఏ ముఖ్యమంత్రి కూడా నిధులను విడుదల చేయలేదన్నారు. వ్యక్తిగత టెండర్లను ఆహ్వానించి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల డీపీఓలు టీ నాగరాజునాయుడు, మంజులవాణి, హౌసింగ్ నంద్యాల పీడీ టీవీ భాస్కర్‌నాయుడు, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు కే సుబ్రమణ్యం, ఆర్ నాగరాజు, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎం ఉమాపతి, డీఈఓ రంగారెడ్డి, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్ శ్రీనివాసకుమార్, జాకీర్‌హుసేన్, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.రామగిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులను పూర్తి చేయించండి



జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులను సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజుకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. నాలుగు సంవత్సరాల క్రితం కోడుమూరు - వెల్దుర్తి రోడ్డు మంజూరైందని, ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని కనీసం ప్యాచ్ వర్కులైనా చేయాలని కోడుమూరు జెడ్పీటీసీ బీ రఘునాథరెడ్డి ప్రశ్నించారు. అధిక లోడ్‌తో భారీ వాహనాలు తిరగడంతో అనేక గ్రామీణ రోడ్లు ఛిద్రమవుతున్నాయని, ఆయా రోడ్లపై అధిక టన్నేజ్‌తో వెళ్లేందుకు వీలు లేకుండా చర్యలు చేపట్టాని ఎమ్మెల్యే కాటసాని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో పలు గ్రామీణ రోడ్లు దెబ్బతిన్నాయని, వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని ఆయన పీఆర్, ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. కల్లూరు వక్కెర వాగుపై అధ్వానంగా ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ ఏర్పాటు చేయాలని, అలాగే బ్రిడ్జి పనులను కూడా చేపట్టాలన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి



స్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఈరన్నస్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ పరిసరాలను పరిశీలించారు. పార్కింగ్ ఏర్పాట్లపై కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పూజా సామగ్రిని అధిక రేట్లకు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్యాణకట్ట వద్ద భక్తులకు ఇబ్బందులు కల్గించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎస్పీ వెంట ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, డీఎస్పీ శ్రీనివాసులు, కోసిగి సీఐ ఏరిషావలి ఉన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించండి

ఆదోనిఅర్బన్: పోలీసులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం పోలీసులకు వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీతోపాటు ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐలు శ్రీనివాసనాయక్, నరసింహరాజు, నిరంజన్‌రెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఆన్‌లైన్‌లో వచ్చే నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లోను, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ ఆదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. డిసెంబర్ 3న పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఉత్తమ పాఠశాలగా 'అబ్దుల్ కలాం' హైస్కూల్

కర్నూలు సిటీ: రాష్ట్రస్థాయిలో కర్నూలు ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఈ పాఠశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో 53 మంది పదో విద్యార్థులు పరీక్షలు రాస్తే అందరూ ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ఓ విద్యార్థిని 525 మార్కులు సాధించింది. ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల ఉత్తమ స్కూల్ అవార్డును ఆ స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి అందుకోనున్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.3.43కోట్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని ఉభయ దేవాలయాల్లోని హుండీలలో గత 28 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా నగదుగా రూ.3,43,68,091 లభించినట్లు ఈఓ ఎస్.లవన్న తెలిపారు. నగదుతో పాటు బంగారం 172.400 గ్రాములు, వెండి 10.350 కిలోలు, విదేశీ మారకద్రవ్యం వచ్చాయన్నారు. హుండీల లెక్కింపులో దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్ఆర్ సున్నా వడ్డీ మెగా చెక్కును అందజేసిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు
- జిల్లాలోని 41,642 స్వయం సహాయక గ్రూపులకు రూ.50.45 కోట్లు జమ



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, మేయర్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు కాటసాని, డాక్టర్ జె.సుధాకర్ అన్నారు. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన వైఎస్ఆర్ సున్నా వడ్డీని శుక్రవారం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ప్రజాప్రతినిధులు, డీఆర్‌డీఏ పీడీ ఉమామహేశ్వరి, పలు స్వయంసహాయక గ్రూపు సభ్యులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మహిళలు వృద్ధిలోకి వస్తే వారి కుటుంబాలు బాగుపడతాయని ఆలోచన చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు రూ.35 వేల రాయితీ ఇస్తున్నారని, ఉల్లి, టమాటా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. 2014 ఎన్నికల్లో పొదుపు రుణాలను మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా నాలుగు విడతల్లో వైఎస్ఆర్ ఆసరా ద్వారా రుణాలను పొదుపు మహిళలకు తిరిగి ఇచ్చి బాసటగా నిలిచారన్నారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు.

ఇబ్బందులు ఉన్నా..

కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా మహిళలను వృద్ధి పథంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కర్నూలు జిల్లాలో 41,642 స్వయం సహాయక గ్రూపుల్లోని అక్కాచెల్లెమ్మలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద రూ 50.45 కోట్లను ప్రభుత్వం జమ చేసినట్లు చెప్పారు. అందులో డీఆర్‌డీఏ కింద ఉన్న 29,814 స్వయం సహాయక సంఘాలకు రూ.31.91 కోట్లు, మెప్మా పరిధిలోని 11,828 సంఘాలకురూ.18.54 కోట్లను కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు మహిళలకు మెగా చెక్కును అందజేశారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



నా భర్త సన్నకారురైతు. మాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఆ పొలంలో పంటలు వేసుకొని వచ్చే ఆదాయంతో ఇద్దరి పిల్లలను చదివించుకోవడం ఇబ్బందిగా ఉండేది. భర్తకు సాయ పడాలన్న సంకల్పంతో టైలరింగ్ నేర్చుకున్నాను. రుణ్మిణి పొదుపు గ్రూపులో చేరడంతో లక్ష రూపాయల రుణం వచ్చింది. దానితో ఆరు కుట్టుమిషన్లను కొనుగోలు చేసి పలువురికి శిక్షణ ఇస్తూ నెలకు రూ.20 వేలు సంపాదిస్తున్నాను. నేను తీసుకున్న రుణానికి సున్నావడ్డీ అమలైంది. జగనన్నకు రుణపడి ఉంటాం.

– పి.సుగుణ, పసుపల, కర్నూలు మండలం


చాలా సంతోషం



గతంలో మేం బుట్టలు, పొరకలు, గంపలు అల్లి వచ్చిన ఆదాయంతో జీవనం చేసేవాళ్లం. పెరుగుతున్న ఖర్చులకు ఆదాయం సరిపోయేది కాదు. జయ సాయి పొదుపు గ్రూపులో చేరడంతో లక్ష రూపాయల రుణం వచ్చింది. దాని ద్వారా చీరల వ్యాపారం మొదలు పెట్టాను. లక్ష రూపాయలకు సున్నా వడ్డీ అమలు కావడం చాలా సంతోషంగా ఉంది.

– ఈ.జయలక్ష్మి, కర్నూలు

వైఎస్సార్ చలువతోనే సీమ సుభిక్షం



పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు పరుగులు తీస్తున్న కృష్ణా జలాలు



కృష్ణమ్మకు వాయనం సమర్పిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు శిల్పా, ఆర్థర్, గంగుల ప్రభాకర్‌రెడ్డి

- జగనన్న పాలనలో వ్యవసాయ రంగానికి పెద్దపీట
- చంద్రబాబు ప్రాజెక్ట్‌ల సందర్శనతో వర్షాలు కురవడం లేదు
- నీటిని సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకుందాం
- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల కార్యక్రమంలో ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు శిల్పా, ఆర్థర్, గంగుల

జూపాడుబంగ్లా: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చలువతోనే రాయలసీమ సస్యశ్యామలంగా మారిందని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, జలవనరుల సంఘం ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లకు పూజలు నిర్వహించి అనంతరం స్విచ్ ఆన్ చేసి కృష్ణా జలాలను ఎస్సార్‌ఎంసీ కాల్వలోకి విడుదల చేశారు. అనంతరం కృష్ణమ్మకు హారతినిచ్చి వాయనం సమర్పించారు. కృష్ణా జలాలు దిగువకు పరుగులు తీశాయి. నీటి విడుదల దృశ్యాలను వీక్షించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలను కొనియాడారు. వ్యవసాయ, సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జలవనరుల సంఘం చైర్మన్ కర్రా గిరిజారెడ్డి, ఆర్డీఓ దాసు, పోతిరెడ్డిపాడు ఎస్ఈ వెంకటరమణయ్య, ఈఈ మనోహర్‌రాజు, డీఈ నాగేంద్రకుమార్, ఈఈ శివశంకర్‌రెడ్డి, ఏఈలు విష్ణువర్ధన్‌రెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబే కారణం

– శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ చైర్మన్

ఈ ఏడాది పూర్తి స్థాయిలో రిజర్వాయర్లు నిండకపోవడానికి కారణం చంద్రబాబే. ఆయన ప్రాజెక్ట్‌ల సందర్శన చేపట్టడంతోనే వర్షాలు కురవడం లేదు. రాయలసీమ రైతుల కోసం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ధర్నాలు, ఆందోళనతో అడ్డుకునే ప్రయత్నం చేసి సీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయారు. ఇప్పుడు ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. ఆగస్టు నెలాఖరులోగా వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టులు నిండితే సాగునీటికి ఇబ్బంది ఉండదు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఓట్ల కోసమే చంద్రబాబు గిమ్మిక్కులు

– తొగురు ఆర్థర్, నందికొట్కూరు ఎమ్మెల్యే

10 శాతం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పనులు పూర్తిచేయించలేని చంద్రబాబు నాయుడు అన్నీ ప్రాజెక్టులు తానే నిర్మించానని పేర్కొనటం హాస్యాస్పదం. ఆనాడు వ్యవసాయం దండగన్న ఆయనే ఓట్ల కోసం ప్రాజెక్టులను సందర్శించి రైతులపై కపట ప్రేమను ఒలకబోయడం విడ్డూరంగా ఉంది. ఆయన మాటలను ప్రజలు, రైతులు పట్టించుకునే పరిస్థితిలో లేరు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఆర్బీకేలు స్థాపించి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చారు. రైతుభరోసా, పంట నష్టపరిహారం, పంటల బీమా తదితర పథకాలతో ఆదుకుంటున్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎంతోనే సాధ్యం

– పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎంపీ

కరువు నేలకు నీరందించాలనే లక్ష్యంతో నాడు వైఎస్సార్ 1,500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 44 వేల క్యూసెక్కులకు పెంచుతూ విస్తరించారు. అదే బాటలోనే ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోతిరెడ్డి పాడు సామర్థ్యాన్ని 44 వేల నుంచి 80 వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమను సుభిక్షంగా మార్చుతున్నారు. రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం. రైతులు, ప్రజలకు ముఖ్యమంత్రి అండగా నిలిచారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉండటం, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో శ్రీశైలం డ్యాం నిండటంలో ఆలస్యమవుతోంది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటితో దిగువనున్న రిజర్వాయర్లు నింపుకొని సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకుందాం.

నీటిని పొదుపుగా వాడుకోండి

– గంగుల ప్రభాకర్‌రెడ్డి, జలవనరుల సంఘం ప్రభుత్వ సలహాదారుడు

ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వలను పొదుపుగా వాడుకుందాం. ఆయకట్టు రైతులు నీటిని వృథా చేయొద్దు. కేవలం మెట్ట పంటలు మాత్రమే సాగు చేసుకోవాలి. రైతులు అధికారుల సూచనలు తప్పక పాటించాలి. ముందుగా పోతిరెడ్డిపాడు నుంచి విడుదలయ్యే నీటితో రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపి తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం. వర్షాలు సంవృద్ధిగా కురిసి ప్రాజెక్టులు పూర్తిగా నిండితే రైతులు వరి సాగు చేసుకోవచ్చు. వ్యవసాయ రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. రైతులు కష్టనష్టాలు అధిగమించేలా అడుగడుగునా అండగా నిలుస్తున్నారు.

మహాసభలకు హాజరు కండి




పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

కర్నూలు(అగ్రికల్చర్)/డోన్‌టౌన్: విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఆంధ్రప్రదేశ్ నాన్‌గజిటెడ్ అధికారుల సంఘం 21వ మహాసభలకు హాజరు కావాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఉమ్మడి కర్నూలు శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి కోరారు. శుక్రవారం డోన్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మహాసభల పోస్టర్లను మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీహెచ్ వెంగళరెడ్డి మాట్లాడుతూ.. మొదటి రోజు మహాసభలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. స్టేట్ ఆడిట్‌లోని ఎన్‌జీవోలను డైరెక్టర్ ఉద్దేశపూర్వకంగా వేధింపులకు గురి చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల్లో 10 శాతం పోస్టులను ల్యాబ్ సూపర్‌వైజర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, కర్నూలు నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, పాండురంగారెడ్డి, నాయకుడు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో రూ.1,204.04 కోట్లతో సదుపాయాల ప్రాజెక్టులు

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం పోర్టులో రూ.1,204.04 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తున్నట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ ప్రాజెక్టుల అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

నిలకడగా శ్రీశైలండ్యాం నీటిమట్టం



శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి గత రెండు రోజులుగా వరద ప్రవాహం నిలిచిపోయింది. డ్యాం వద్ద నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. గురువారం నుంచి శుక్రవారం వరకు జలాశయంలో ఉన్న నీటి నుంచి 19,460 క్యూసెక్కులను వినియోగించుకొని భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 10.283 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2,400 క్యూసెక్కుల నీరు విడుదలైంది. శుక్రవారం సాయంత్రం నుంచి రెండు విద్యుత్ కేంద్రాలలో ఉత్పాదన ప్రారంభమైంది. ప్రస్తుతం జలాశయంలో 121.2458 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 864.70 అడుగులుగా నమోదైంది.

‘పట్టు’తప్పకుండా..

- పట్టుపరిశ్రమకు ప్రోత్సాహకాలు
- ఎస్సీ, ఎస్టీలకు 90, ఇతరులకు 75 శాతం సబ్సిడీలు
- రూ.1.27 కోట్ల ఉపాధి నిధుల కేటాయింపు
- ఈ ఏడాది 208 టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యం



పట్టుపురుగుల పెంపకం



మల్బరీ తోట

కర్నూలు(అగ్రికల్చర్): అవగాహనతో పట్టు సాగు చేస్తే రైతులు లాభాలు పొందవచ్చు. మార్కెట్లో పట్టుగూళ్ల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పట్టుసాగుపై రైతులకు ఆసక్తి పెరుగుతోంది. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటి వరకు 40.50 ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటారు. పట్టు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన సబ్సిడీలు ఇస్తోంది. యూనిట్ ధరలో ఎస్సీ, ఎస్టీలకు 90, ఇతరులకు 75 శాతం సబ్సిడీ ఇస్తోంది. మల్బరీ మొక్కలు నాటుకునేందుకు ఎకరాకు ఎస్సీ, ఎస్టీలకు రూ.22,500, ఇతరులకు రూ.18,500 ప్రకారం 5 ఎకరాల వరకు సబ్సిడీ లభిస్తుంది. షెడ్ నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.3 లక్షలు, ఇతరులకు రూ.3.60 లక్షలు, వ్యాధినిరోధక మందులకు ఎస్సీ, ఎస్టీలకు రూ.4,500, ఇతరులకు రూ.3,750, సూట్ రేరింగ్ స్టాండ్ కోసం ఎస్సీ, ఎస్టీలకు ఎస్సీ,ఎస్టీలకు రూ.40,950, ఇతరులకు రూ.34,125, 10 ట్రేస్‌లు, 436 నేత్రికలకు అందరికీ రూ.4,550 సబ్సిడీ లభిస్తుంది.

ఉపాధి నిధులతో..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూడా పట్టు పరిశ్రమ సాగుకు సహకారం లభిస్తోంది. పట్టు పరిశ్రమకు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1.27 కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి నిధులతో మెటీరియల్ కాంపోనెంటు కింద 19 షెడ్ల నిర్మాణాలకు రూ.2.98 లక్షలు చెల్లిస్తారు. 32.04 ఎకరాలకు ప్లాంటేషన్ కోసం లేబర్ కాపోనెంటు కింద రూ.30 వేలు చెల్లిస్తారు. 2023–24లో 300 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టి పట్టు పురుగుల పెంపకానికి 5 ఎకరాలకు ఒకటి చొప్పున 60 షెడ్లు నిర్మించాలనేది లక్ష్యంగా అధికారులు నిర్ణయించారు.

ఉత్పత్తి పెరిగితే నికరాదాయం

ఈ ఏడాది 208 టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఈ లక్ష్యాన్ని అధిగమించేందుకు పట్టుగూళ్ల ఉత్పత్తిని పెంచడంపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 100 పట్టు గుడ్లకు 100 కిలోల పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తే లక్ష్యాన్ని అందుకోవచ్చని ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు 46.609 టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి చేసినట్లు తెలుస్తోంది. ఉత్పత్తి పెరిగితేనే రైతులకు నికరాదాయం ఎక్కువగా ఉంటుంది. జిల్లాలో బైవోల్టెన్ పట్టుసాగు ఉంది. వీటి ద్వారా నాణ్యమైన పట్టు దారం ఉత్పత్తి అవుతుంది. ప్రభుత్వం బైవోల్టెన్ పట్టుగూళ్లకు కిలోకు రూ.50 ప్రకారం ఇన్సెంటివ్ ఇస్తోంది.

పశువుల ఎరువు వాడాలి



మల్బరీ సాగుకు పశువుల ఎరువులు వాడాలి. సంవత్సరానికి ఎకరాకు 6 టన్నుల పశువుల ఎరువు వేయాలి. జూన్–జూలైలో మూడు టన్నులు, డిసెంబరు–జనవరిలో 3 టన్నులు వేయాలి.అంతేగాక ఎకరాకు 50 కిలోల అమ్మోనియం సల్ఫేట్, 28 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేటు, 20 కిలోలు మీరట్ ఆఫ్ పొటాష్‌లను కలిపి 5 విడతలుగా వేయాలి. ఈ ఏడాది 300 ఎకరాల్లో మల్బరీ తోటలు అభివృద్ధి చేయాల్సి ఉంది.

– విజయ్‌కుమార్, పట్టుపరిశ్రమ శాఖ అధికారి, కర్నూలు జిల్లా

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం



ఆనందరావు(ఫైల్)

మహానంది: నంద్యాల – గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా వాసి దుర్మరణం చెందాడు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం కుందంపల్లి గ్రామానికి చెందిన ఎం.ఆనందరావు (32) నంద్యాల మండలం అయ్యలూరుమెట్ట వద్ద ఉన్న నవజీవన్ కాలేజ్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ సంస్థలో స్పెషల్ డీఈడీ చేస్తున్నాడు. అందులో భాగంగా ప్రాక్టికల్స్ పరీక్షల కోసం శుక్రవారం కళాశాలకు చేరుకున్నాడు. తిరుగుప్రయాణంలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా నల్లమల ఘాట్‌రోడ్డులోని పాతబొగద వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న మినీలారీ ఢీకొనడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుందంపల్లికి చెందిన ముండ్ల జాకబ్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో ఆనందరావు పెద్దకుమారుడు. అస్సాం రాష్ట్రంలోని నమ్రతతో ఫేస్‌బుక్‌లో పరిచయం కాగా ఆరునెలల క్రితం వివాహం అయింది. మార్కాపురంలో కుటుంబంతో సహా ఉన్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో వారి కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

- రోడ్డు ప్రమాదంలో భర్తకు గాయాలు

కోసిగి: గొడవపడి భార్య పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా, భార్యను చూసేందుకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో భర్త గాయపడ్డాడు. జుమ్మాలదిన్నె గ్రామానికి చెందిన గొట్టయ్య శుక్రవారం ఉదయం ఇంటి దగ్గర మద్యం తాగి భార్య ఈరమ్మతో గొడవ పడ్డాడు. ఆమె క్షణికావేశానికి గురై ఇంట్లోకి వెళ్లి పురుగు మందు తాగింది. గమనించిన చుట్టుపక్కల బంధువులు ఆమెను వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గొట్టయ్య బైక్‌పై కోసిగికు వస్తుండగా నేలకోసిగి గ్రామ సమీపంలో అదుపు తప్పి కిందకు పడి పోయాడు. దీంతో ఆయనకు తలకు తీవ్ర గాయమైంది. కోసిగి ప్రాథమిక కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆసుపత్రి నుంచి కర్నూలుకు తరలించినట్లు తెలిసింది.

కారుకు నిప్పు పెట్టిన ఆకతాయిలు

- తప్పిన పెను ప్రమాదం



మంటలను ఆర్పుతున్న స్థానికుడు

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న కారుకు ఆకతాయిలు శుక్రవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. కోసిగికి చెందిన బజాజ్ షోరూమ్ యజమాని పెర్లి అనుమేష్‌కు చెందిన కారు కొద్ది కాలంగా రిపేరీ ఉండడంతో బంక్ సమీపంలోని ఖాళీ ఉన్న ప్రదేశం ఉంచాడు. ఆకస్మికంగా కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమైన స్థానికులు సమీపంలో కుళాయి నీటితో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు వేగంగా వ్యాపించి కారుకు ఉన్న టైర్లు, మిషన్ భాగం కాలిబూడిదైంది. అయితే కారుకు పక్కనే మరో లారీ ఉంది. మంటలు వ్యాప్తి చెందకుండా స్థానికులు పక్కనే ఉన్న లారీని దూరంగా నెట్టేశారు. కొన్ని అడుగుల దూరంలో పెట్రోల్ బంక్ ఉంది. కారుకు ఉన్న మంటలు వెంటనే ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నాలుగు నెలల క్రితం పెట్రోల్ బంక్ సమీపంలోనే ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న టీచర్‌కు చెందిన స్కూటీకి నిప్పు పెట్టారు. దీంతో ఆప్రాంతంలో వాహనాలు ఇంటి బయట పెట్టాలంటే స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

విధుల్లో చేరిన ఏసీబీ డీఎస్పీ



ఏసీబీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటాద్రి

కర్నూలు: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కర్నూలు రేంజ్ డీఎస్పీగా నియమితులైన వెంకటాద్రి విధుల్లో చేరారు. మే 15వ తేదీ నుంచి విజయవాడ చీఫ్ ఆఫీస్‌లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఈయనను ఈనెల 2వ తేదీన కర్నూలు ఏసీబీకి నియమిస్తూ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఇక్కడ పనిచేసిన శివనారాయణస్వామి మేలో ఆదోని డీఎస్పీగా బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఈ స్థానం ఖాళీగా ఉంది. తిరుపతి జిల్లా పాకాలకు చెందిన వెంకటాద్రి 1991లో ఎస్ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. ఎస్ఐ, సీఐగా కర్నూలు రేంజ్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. 2013లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. హైదరాబాదు, నెల్లూరు జిల్లాల్లో పనిచేశారు. 2019 జూన్ నుంచి ఈ ఏడాది మే 15 వరకు కర్నూలు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పనిచేసి చీఫ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కొంతకాలంగా పోస్టు కోసం ఎదురు చూస్తున్న ఈయనను కర్నూలు ఏసీబీ విభాగానికి బదిలీ చేయడంతో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయం చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు సుబ్బరాయుడు, బాషా, ఏఎస్ఐ నాగభూషణం, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, కార్యాలయ సిబ్బంది డీఎస్పీని మర్యాదపూర్వకంగా పూల బొకేతో కలిశారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయండి...

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పనిచేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి డీఎస్పీ సూచించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయ సిబ్బందితో ఆయన కొద్దిసేపు సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల కోసం అధికారులు లంచాలు డిమాండ్ చేసినా, ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్న వారి గురించి 9440446178 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవినీతి అధికారులపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్, ఏసీబీ కోర్టు జడ్జి సునితను డీఎస్పీ మర్యాదపూర్వకంగా కలిశారు.

టెండర్ నోటీస్

ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు నందు ఉన్న 15 సం. పైబడిన 3 అంబులెన్సులను కన్డెమ్ చేయడానికి టెండర్లు పిలవడమైనది. టెండరు అప్లికేషన్‌తో కూడిన పూర్తి వివరాలు 12.08.2023 నుండి 16.08.2023 మధ్యాహ్నం 1.00 లోగా కార్యాలయ పని వేళల్లో సంప్రదించగలరు.

సం/- పర్యవేక్షకులు,
ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
G.H. రోడ్ బ్రాంచ్, ఆదోని(T & M), కర్నూలు జిల్లా, ఆం.ప్ర

స్వాధీనతా ప్రకటన (లాంఛనప్రాయం)
రూల్ 4, 8 (1) మరియు 8(2) క్రింద (చర మరియు స్థిరాస్తుల కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, G.H. రోడ్ బ్రాంచ్, ఆదోని (T & M), కర్నూలు జిల్లా, ఆం.ప్ర** యొక్క అధీకృత అధికారియగు దిగువ సంతకందారు **16.06.2022 తేదీగల డిమాండ్ నోటీసు** జారీ చేసి, **రుణగ్రహీత: ఆదిత్య ఫ్యూయేల్, ప్రొప్రైటర్: డి.లక్ష్మీదేవి** డి.నం.17/394ఎ, సర్వే నం. 169/B, వార్డు నం.17, వాసవీ థియేటర్ దగ్గర, విజిటబుల్ మార్కెట్ రోడ్, గుంతకల్ (M), తిమ్మనచెర్ల (V), అనంతపూర్ జిల్లా, **గ్యారంటార్: 1. కె.జయసూరి, తండ్రి కె.పెద్దన్న, 2) కె.విజయకుమార్ తండ్రి కె.జయసూరి** డి.నం.17/394ఎ, సర్వే నం. 169/B, వార్డు నం.17, వాసవీ థియేటర్ దగ్గర, విజిటబుల్ మార్కెట్ రోడ్, గుంతకల్ (M), తిమ్మనచెర్ల(V) అనంతపూర్ జిల్లా, **ఖాతా నం. 38041931338-ABL, 38041947054-EDFS, 3952900702-GECL, 40658943642-GECL-Exn** వారిని డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తం **16.06.2022** నాటికి **రూ.52,71,557.00 (యాభై రెండు లక్షల డెబ్బై ఒక వేల ఐదు వందల యాభై ఏడు రూపాయలు మాత్రమే) (రూ.22,75,706.00 + రూ.17,28,456.00 + రూ.7,24,839.00 + రూ.5,50,556.00)**తో పాటు కాంట్రాక్చువల్ రేటు వంతున **17.06.2022** నుండి వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ।।వి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా తిరిగి చెల్లించేందుకు కూడా మీరు బాధ్యులై ఉన్నారు.

రుణగ్రహీత సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన, బ్యాంకుకు తనఖా పెట్టిన ఆస్తులను దిగువ సంతకందారు **07 ఆగస్టు 2023న, స్వాధీనం** చేసుకున్నారని రుణగ్రహీతకు/గ్యారంటార్లకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునేందుకు లభ్యమగు సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను గమనించాల్సిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

“సెక్యూర్డ్ క్రెడిటార్‌చే అయిన వ్యయాలు, చార్జీలు మరియు ఖర్చులతో పాటు తన బకాయి మొత్తాన్ని సెక్యూర్డ్ ఆస్తుల లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం బహిరంగ వేలం ప్రకటన లేదా కొటేషన్ల కోరుతూ ప్రకటన లేదా బహిరంగ లేదా ప్రైవేట్ ట్రీటీ నుండి టెండరు ప్రకటన ప్రచురణ తేదీలోగా ఏ సమయంలోనైనా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించవలెను.” (i) సెక్యూర్డ్ ఆస్తులను లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా సెక్యూర్డ్ క్రెడిటార్‌చే బదిలీ చేయబడవు, మరియు (ii) ఈ ఉప-సెక్షన్ క్రింద అట్టి మొత్తం చెల్లించేలోగా ఆస్తుల లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఏదేని చర్య తీసుకున్నట్లయితే, సెక్యూర్డ్ ఆస్తుల లీజు లేదా అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం సెక్యూర్డ్ క్రెడిటార్‌చే ఎలాంటి తదుపరి చర్య తీసుకోబడదు.

సదరు ఆస్తులతో వ్యవహరించరాదనియూ, సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారములైనా **రూ.52,71,557/- +** కాంట్రాక్చువల్ రేటు వంతున వడ్డీ + అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు మొ।।వి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, G.H. రోడ్ బ్రాంచ్, ఆదోని (T & M), కర్నూలు జిల్లా, ఆం.ప్ర** యొక్క చార్జికు లోబడి ఉంటాయని ముఖ్యంగా రుణగ్రహీతను/ గ్యారంటార్లను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు “సి”

పార్ట్-I: (డాక్యుమెంట్లలో పేర్కొన్న తాకట్టుపెట్టిన ఆస్తులు అంటే స్టాక్స్, బుక్ డెట్స్, రిసీవబుల్స్, కంజూమబుల్ స్టోర్స్ మరియు స్పేర్స్‌తో సహా కరెంట్ అసెట్స్ మరియు తాకట్టుపెట్టిన చర ప్లాంట్ అండ్ మెషినరీ మొ।।వి తెలియచేయాలి) (షెడ్యూలు-“బి”)

పార్ట్-II: (తనఖా డాక్యుమెంట్లు/ డీడ్స్‌కు రిఫరెన్స్ కలిగిన డాక్యుమెంట్లలో తెలిపిన ప్రకారం బ్యాంకుకు తనఖాపెట్టిన స్థిరాస్తుల వివరాలను పేర్కొనవలెను) (షెడ్యూలు-“బి”)

షెడ్యూలు-“A”, (మొత్తం ఆస్తి వివరణ)

1. **కె.జయసూరి, తండ్రి కె.పెద్దన్న, 2) కె.విజయకుమార్ తండ్రి కె.జయసూరి** పేరున, కలిగి ఉండి SRO గుంతకల్, అనంతపురం జిల్లా, వద్ద నమోదైన డాక్యుమెంట్ నం.1399/2008 తేది 14.07.2008 ప్రకారం అనంతపురం జిల్లా, తిమ్మనచెర్ల గ్రామం, గుంతకల్ మం. వెజిటబుల్ మార్కెట్‌రోడ్ వాసవి థియేటర్ దగ్గర వార్డు నం.17, సర్వే నం.169/బి, డి.నం.17/394ఎ కలిగిన నమోదిత ఆస్తి యావత్తు, విస్తీర్ణం 120చ.గజాలు లేదా 1080 చ.అ.లు, EXW: 60అ.లు లేదా 18.28 మీ.లు, NXS: 18అ.లు లేదా 5.48మీ.లు మరియు **సరిహద్దులు : తూర్పు:** రోడ్డు, **ఉత్తరం:** జయంతి సూర్యనారాయణ ఇల్లు, **పశ్చిమం:** వాసవీ థియేటర్ రోడ్డు, **దక్షిణం:** మల్లికార్జున మరియు సుబ్రమణ్యం ఇల్లు.

గమనిక: స్వాధీనతా ప్రకటన జారీ చేసిన తర్వాత రుణగ్రహీత **ABL - రూ.4,72,600-, EDFS - రూ.31,50,242-, GECL-1- రూ.3,69,200, మరియు GECL-2- రూ.70,000** మొత్తంను రుణగ్రహీత చెల్లించారు. మరియు ఇంతకు ముందు జారీ చేసిన స్వాధీనతా ప్రకటన కూడా ఉపసంహరించటమైనది.

తేది: 07.08.2023, ప్రదేశం: ఆదోని — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వేడుకగా ‘నా భూమి– నాదేశం’

- 350 గ్రామాల్లో శిలాఫలకాల ఆవిష్కరణ



గూడూరు మండలంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ‘నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం’ కార్యక్రమాలను గ్రామాల్లో వేడుకగా చేపడుతున్నారు. జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డితో కలిసి ఉమ్మడి కర్నూలు జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ పీవీ రూప్‌కుమార్ శుక్రవారం గూడూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో పర్యటించారు. నా భూమి– నా దేశం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో 484 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతి పంచాయతీలోను 75 మొక్కలు నాటుతున్నట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లాలోని 350 గ్రామ పంచాయతీల్లో అమృత్ మహోత్సవాలు నిర్వహించారు. శిలాఫలకం ఆవిష్కరణ, మొక్కలు నాటడం, వీరులకు వందనం, వసుధకు వందనం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు చేపట్టారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కూడా చేపట్టారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్రానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సాక్షిగణపతి ఆలయానికి సమీపంలో చెట్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు శుక్రవారం వన్ టౌన్ ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. దాదాపు 50 –60 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి ఐదు రోజులు క్రితం మృతి చెంది ఉండవచ్చునని, మృతదేహం అంతా గుర్తు పట్టని విధంగా ఉబ్బిపోయిందని తెలిపారు. నగ్నంగా పడి ఉండడం వలన మృతుడికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించ లేదన్నారు. స్థానికులు, యాత్రికులు ఎవరైన మృతునికి సంబంధించిన ఆధారాలు గుర్తిస్తే 9121101193, 9121101192కు సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసుకుని పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రాజెక్ట్ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

వీఆర్వోపై టీడీపీ నాయకుడి దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

గోనెగండ్ల: ప్రభుత్వ అధికారులపై టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు ఘటన మరువకముందే బుధవారం గోనెగండ్ల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో వేణుగోపాల్ రావు టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ వీరన్న, భార్య శివ పార్వతి, కుమారుడు ఉదయ్ కుమార్‌లు కలిసి దాడి చేసి విధులకు ఆటంకం కలిగించారు. ఈ మేరకు వీరన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. వివరాలు.. గోనెగండ్ల మండలంలోని నెరుడుప్పల గ్రామానికి వీఆర్వోగా వేణుగోపాల్ రావు పనిచేస్తున్నారు. అయితే గతంలో పెద్దనేలటూర్ గ్రామానికి వేణుగోపాల్ రావు వీఆర్వోగా పనిచేశారు. మాజీ సర్పంచ్ వీరన్న, భార్య శివ పార్వతి, తండ్రి ఉల్లెక్కి పేరు మీద 9 ఎకరాల భూమి ఉంది. అదే గ్రామానికి చెందిన వ్యక్తులు 2015లో అదే సర్వే నంబర్‌లో ఉన్న 2 ఎకరాల భూమిపై కోర్టులో కేసు వేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం భూమిని చుక్కల భూమిగా పెట్టారు. ఈ విషయమై బుధవారం సాయంత్రం మాజీ సర్పంచ్ వీరన్న, భార్య శివ పార్వతి, కుమారుడు ఉదయ్ కుమార్‌లు తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చి దౌర్జన్యం చేసి విధులు నిర్వహిస్తున్న వీఆర్వో వేణుగోపాల్ రావు విధులకు ఆటంకం కలిగించి, దాడి చేశారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్యోగులపై దాడులు తీవ్రం చేశారని, టీడీపీ అధికారంలోకి వస్తే ఉద్యోగుల పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు.

టీబీ డ్యాం సమాచారం



పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,628.68
టీఎంసీల సామర్థ్యం	:105,788
ప్రస్తుతం	:89,189
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:13234
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,701

అల్లర్లు సృష్టించడమే వారి అజెండా

- వారిని రాష్ట్రం నుంచి తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయి
- వారాహి, నారాహి యాత్రలను జనం నమ్మరు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, బీవై రామయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీవై రామయ్య, చిత్రంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడం, అశాంతి నెలకొల్పడమే అజెండాగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పెట్టుకున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజాదరణ పెరిగిపోతుండడాన్ని టీడీపీ, జనసేన నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ యాత్రల పేరుతో రోడ్లపైకి వచ్చి సైకోల్లా వ్యవహరిస్తున్నారన్నారు. బాబు, పవన్‌ల జెండాలు వేరైనా ఎజెండా మాత్రం ఒక్కటేనని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏమి చెస్తారో చెప్పకుండా ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకోవాలంటే తమ వెంట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

వీళ్లను నమ్ముకుంటే జీవితాలు నాశనమే..

వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. వారాహి, నారాహి యాత్రలను జనం నమ్మబోరని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రం నుంచి వారిని తరిమేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రాజెక్టుల యాత్ర పేరుతో చంద్రబాబు కుల మతాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఇంతటి దుర్మార్గ ప్రతిపక్ష నాయకుడు రాష్ట్రంలో ఉండడం దురదృష్టకరమన్నారు. సభల్లో కొట్టండ్రా, తన్నండ్రా అని రెచ్చగొట్టడం బాబుకే చెల్లిందన్నారు. పాదయాత్ర అట్టర్ ఫ్లాప్ కావడంతో లోకేష్‌కు మతి తప్పిందన్నారు. ‘ఎవరెన్ని కేసులు అధికంగా పెట్టించుకుంటే.. వారే పెద్ద నాయకుడు’గా భావిస్తామని చెప్పడం చూస్తే సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారో తెలుస్తుందన్నారు. ‘చూసుకుంటాం.. గుర్తు పెట్టుకుంటాం.. వదలం’ అని పవన్ కళ్యాణ్ బెదిరించడంతో పాటు చెప్పులు చూపడం దారుణమన్నారు. ఓ చోట నిలబడి కనీసం ఐదు నిమిషాలు మట్లాడలేని పవన్.. వచ్చే ఎన్నికల్లో 20 చోట్ల పోటీ చేసినా కనీసం డిపాజిట్లు కూడా రావన్నారు. వీళ్లను నమ్ముకుంటే జీవితాలు నాశనం అవుతాయని, ఆ పార్టీల కార్యకర్తలు గ్రహించాలన్నారు. తాళి బీజేపీతో కట్టించుకున్న పవన్ టీడీపీతో సంసారం చేస్తున్నారని, దీనిని రాజకీయ వ్యభిచారం అంటారనే విషయాన్ని గుర్తు చేశారు. రెచ్చగొట్టి అశాంతికి కారణమవుతున్న నేతలపై కేసులు పెట్టాలని సీఎంను కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, ఆ పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, ధనుంజయ ఆచారి, సత్యం యాదవ్, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, విక్రమ సింహారెడ్డి పాల్గొన్నారు.

ఎగురుతున్న జెండా మనదే!

ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని పెంపొందించేందుకు భారత ప్రభుత్వం ‘హర్ ఘర్ తిరంగా 2.0’ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు శుక్రవారం తపాలా శాఖ ఉద్యోగులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద మువ్వన్నెల జెండాలను ప్రదర్శిస్తున్న దృశ్యమిది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

